కోటి సంతకాలతో కూటమి విధానాలను ఎండగడదాం

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కోటి సంతకాల సేకరణ ద్వారా ఎండగడదామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. శనివారం ఆయన కోరుకొండ మండలం గాదరాడలో కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుయుక్తులతో ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెడుతోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు ధారాదత్తం చేసే దృక్పథంతో ఉందన్నారు. దానిలో భాగంగానే పేద వర్గాలకు ఉచితంగా వైద్య విద్య, వైద్యాన్ని అందించేందుకు జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్‌ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. కోటి సంతకాలను సేకరించి గవర్నర్‌కు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు, మరోవైపు ప్రజా సంపదను సొంత పార్టీకి చెందిన వారికి ధారాదత్తం చేసేందుకు యత్నిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుపరం కాకుండా ఉద్యమించాలని కోరారు. ఈ పోరాటానికి ప్రజలను సంసిద్ధం చేయాలన్నారు. అంతకుముందు పలువురిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, నాయకులు కంటే వినయ్‌తేజ, ఇతర నాయకులు పాల్గొన్నారు.


గాదరాడలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

క్లుప్తంగా

ప్రజాస్వామ్య పరిరక్షణకు లోక్ నాయక్ కృషి


జయప్రకాష్ నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మరిడయ్య తదితరులు

రంగంపేట: దొడ్డిగుంట గ్రామంలోని బాలగణపతి ఆలయం వద్ద లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ జయంతిని రాజకీయ, సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జయప్రకాష్ నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరిడయ్య మాట్లాడుతూ, బ్రిటిష్ వారితో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ మొదటి మహాత్ముడైతే, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విశేష కృషి చేసిన జయప్రకాష్ నారాయణ రెండో మహాత్ముడని అభివర్ణించారు. 1974 జూన్ 5న పాట్నాలోని గాంధీ మైదానంలో సమావేశమైన లక్షలాది ప్రజలు ప్రేమతో ఆయనకు లోక్ నాయక్ అని పిలిచినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, చోడాబత్తుల రాంబాబు, పంచా దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ


అనపర్తిలో ఆరోగ్య ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

అనపర్తి: ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. మానసిక కౌన్సెలింగ్ నిపుణురాలు నిడికట్ల భ్యూలా గ్రేస్ విద్యార్థులతో మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ


చంద్రశేఖర్, సుజాత దంపతులను సత్కరిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ చేసి శబరిమల వెళుతున్న తూమ్మూరి చంద్రశేఖర్, సుజాత దంపతులను భక్తులు సత్కరించారు. ఈ సందర్భంగా స్వాములు భజనలు, పడి తొక్కారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటరమణ, స్వాములు మీసాల అనిల్‌కుమార్, పండూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో సంపర వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేక పూజలు చేశారు. అలాగే తులసిదళాలతో విశేష, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభిషేకాలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ వెలుగులకు గ్రహణం

- వైఎస్సార్ సీపీ హయాంలోనే నాణ్యమైన సరఫరా
- అనేక గ్రామాల్లో లో–ఓల్టేజీ ఇబ్బందులకు చెక్
- నియోజకవర్గంలో పలు సబ్ స్టేషన్ల ఏర్పాటు
- విద్యుత్ చార్జీలు పెంచి దండుకోవడంపైనే ప్రస్తుతం కూటమి సర్కార్ దృష్టి
- సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజల గగ్గోలు


గత ప్రభుత్వం చినకొండేపూడిలో ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్

సీతానగరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ వెలుగులు ప్రసరించాయి. పలు గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. 2019 వరకు టీడీపీ హయాంలో విద్యుత్ సమస్యలతో నియోజకవర్గ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా పలు గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటు కావడంతో లో ఓల్టేజ్ సమస్యకు చెక్ పెట్టడమే కాకుండా, 24 గంటల నిరంతర విద్యుత్‌కు నాంది పలికారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు.

2019కి ముందు..

టీడీపీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 కాలంలో విద్యుత్ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. రేయింబవళ్లు తేడా లేకుండా విద్యుత్ కోతలు, వ్యవసాయ బోర్లకు ఇచ్చే ఏడు గంటల్లో కోతలు తప్పలేదు. ఇక వేసవి కాలంలో మరీ దారుణంగా విద్యుత్ కోతలు పెట్టారని వివిధ వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

వైఎస్సార్ సీపీ పాలనలో..

ఇలాఉండగా 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పలు సబ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. నాణ్యమైన, నిరంతరాయంగా విద్యుత్‌ను అందించారు. సీతానగరం మండలంలో రూ.5.04 కోట్ల నిధులతో కాటవరం, చినకొండేపూడిల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు నెలకొల్పారు. రాజానగరం మండలంలో పేపకాయలదిబ్బలో రూ.40.5 కోట్లతో 220/33 కేవీ ఉపకేంద్రాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. రాజానగరం, కోరుకొండ మండలాల్లోని రాధేయపాలెం, వెలుగుబంద, నరసాపురంల్లో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 33/11 కేవీ సబ్ స్టేషన్లను నెలకొల్పారు. టీడీపీ పాలనలో నియోజకవర్గంలో ఒక్క సబ్ స్టేషన్ నిర్మించిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గానికి పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతో.. నాలుగు లక్షల మందికి ప్రయోజనం చేకూరింది. సీతానగరం మండలంలో కాటవరం సబ్ స్టేషన్ పరిధిలో జాలిమూడి, మునికూడలి, కాటవరం, కూనవరం, చినకొండేపూడి సబ్ స్టేషన్ పరిధిలో రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి, సింగవరం, చీపురుపల్లి, నాగంపల్లి గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడమే కాకుండా, వ్యవసాయ అవసరాలకు ప్రయోజనం చేకూరింది. అలాగే లో ఓల్టేజ్ సమస్య పరిష్కారమైంది.

తాజా కూటమి ప్రభుత్వంలో..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యుత్ బిల్లులపై చార్జీలు పెంచడంపైనే దృష్టి కేంద్రీకరించింది. విద్యుత్ సరఫరాను మెరుగుపర్చే చర్యలు చేపట్టలేదు. వేసవి కాలంలో విద్యుత్ అంతరాయంతో ప్రజలు విలవిల్లాడారు. వ్యవసాయ బోర్లకు అందించే విద్యుత్‌లో కూడా అంతరాయం కలిగి రైతులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వం దృష్టి పెట్టాలి



కొన్ని దశాబ్దాలుగా విద్యుత్ సమస్యలున్నాయి. వేసవి వచ్చిందంటే కరెంట్ ఉండదని భయపడేవాళ్లం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కరెంట్ కోతలనేవి లేవు. మళ్లీ ఇప్పుడు వేసవిలో కరెంట్ కోతలతో ఇబ్బందులుపడ్డాం. ట్రాన్స్‌ఫార్మర్లు పోతే మరమ్మతులు చేయకుండా రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేకుండా గడిపాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ సమస్యలపై దృష్టిపెట్టాలి.

– బి సత్యనారాయణ, సీతానగరం

జక్కంపూడి రాజా కృషి వల్లే..



అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు నిధులు రాబట్టి, వాటిని పూర్తి చేయడానికి ఎంతో కృషి చేశారు. రూ.కోట్ల నిధులతో నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో సబ్ స్టేషన్లు నిర్మించి, లో–ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపారు. పలు గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించారు. ఆయన కృషి ఫలితంగానే ప్రస్తుతం అనేక గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అనేవి లేకుండా ఉన్నాయి.

– చల్లమళ్ల వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు, సీతానగరం

వ్యవసాయ రంగానికి వ్యాపార సరళి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవరావు

రాజానగరం: దేశంలో వ్యవసాయ రంగాన్ని వ్యాపార సరళిలోకి తీసుకువచ్చేలా యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ అనేక కేంద్ర పథకాలు అమలవుతున్నాయని, వాటిలో పీఎం ధన ధాన్య కృషి యోజన పథకం ముఖ్యమైనదని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ప్రధాన కార్యాలయం నుంచి పీఎం ధన ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మనిర్భరత మిషన్ కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని మండలంలోని కలవచర్లలోగల కేవీకేలో రైతులకు శనివారం లైవ్‌లో వీక్షించే సదుపాయాన్ని కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు రైతులతో మాట్లాడుతూ, దేశ ప్రజలకు ఆహార, పోషకాల భద్రతను సమృద్ధిగా అందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

హైకోర్టు అడిషనల్ జడ్జి నర్సరీ సందర్శన

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని శనివారం హైకోర్టు అడిషనల్ జడ్జి సుమతి జగడం సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆగ్లోనిమా మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ, నర్సరీ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉందని, మొక్కలను పెంచే విధానం బాగుందని చెప్పారు. ఇంకా విదేశాలకు కూడా ఎక్కువ మొక్కలను ఎగుమతి చేస్తే బాగుంటుందన్నారు. నర్సరీ ప్రతినిధులు పుల్లా చినసత్యనారాయణ, పుల్లా పెద్దసత్యనారాయణ ఉన్నారు.

ఆటో సోదరుల పొట్టకొట్టి ధర్మ పన్నాలా..!

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: కష్టజీవులైన ఆటో సోదరుల పొట్టకొట్టి ధర్మ పన్నాలు వల్లిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వాస్తవాలు మాట్లాడాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. శనివారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ. గత వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ప్రజారంజక పాలన సాగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో అదనంగా రూ.10 వేల చొప్పున వాహన మిత్ర ఇచ్చి అండగా నిలిచారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా స్త్రీశక్తి పథకాన్ని ప్రవేశపెట్టి.. వారి జీవనోపాధిని దెబ్బతీశారని ఆరోపించారు. రోజూ కనీసం రూ.ఐదొందల నుంచి రూ.వెయ్యి సంపాదించుకుని సంతోషంగా జీవించే వారి బతుకులు కూటమి ప్రభుత్వ అసంబద్ధ, అనాలోచిత నిర్ణయాలతో అగాధంలోకి తోసేసినట్టు అయిందన్నారు. ఈ పరిస్థితుల్లో వారికి ఏడాదికి రూ.లక్ష ఇచ్చినా నష్టం పూడ్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో.. అంటూ కార్యక్రమం రూపొందించి, సవా లక్ష నిబంధనలు పెట్టి అరకొరగా రూ.15 వేలు ఇచ్చారని, తామేదో వాళ్ల జీవితాలను ఉద్ధరించినట్టు స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మభ్యపెడుతున్నారని ఆక్షేపించారు. స్త్రీశక్తి సభ, ఆటో సోదరుల సేవలో సమావేశాల పేరుతో రామకృష్ణారెడ్డి ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కానీ వాస్తవాలు గ్రహించిన ప్రజలు మీటింగ్ మధ్యలో లేచి వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.లక్ష ఇవ్వాలని సవాల్ విసిరారు. స్త్రీ శక్తి పథకం అమలులోనూ చిత్తశుద్ధి లేదని, బస్సుల సంఖ్య కుదించడమే కాకుండా, నియోజకవర్గంలో దాదాపు 40 గ్రామాలకు ఇప్పటికీ బస్సులు లేవని తెలిపారు. అక్కడ కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో 40 మేకలు ఆహుతి


ప్రమాదంలో కాలిపోయిన ఇంటి సామగ్రి


మేకల కళేబరాలు

కోరుకొండ: గ్యాస్ సిలిండర్లు పేలడంతో జరిగిన అగ్ని ప్రమాదంలో 40 మేకలు ఆహుతైన సంఘటన కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, గ్రామ శివారున పాశాలమ్మ గుడి సమీపంలోని తాటాకు ఇంట్లో జిత్తుక సుబ్రహ్మణ్యం కుటుంబం నివసిస్తోంది. మేకలు మేపుకొంటూ అతడి కుటుంబం జీవనం సాగిస్తోంది. ఇంటి పక్కనే తాటాకు పాకలో అతడు మేకల మందను ఉంచాడు. కుమార్తెను ఇంట్లో ఉంచి సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు ఉదయమే పనిపై బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఏం జరిగిందో కానీ, ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు పేలి తాటాకింటికి, పక్కనున్న మేకల పాకకు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పాకలోని మేకలు అగ్ని కీలలకు ఆహుతయ్యాయి. సుబ్రహ్మణ్యం ఇల్లు, ఇంట్లోని వంట, ఇతర సామగ్రి, నగదు, రెండు గడ్డివాములు బూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని, స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న మేకలు కాలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. ఇంట్లో ఉన్న కుమార్తె గ్యాస్ స్టౌ వెలిగించి, ఆ విషయం మరచిపోయి బయటకొచ్చి ఉండవచ్చని, ఆ సమయంలో గ్యాస్ లీకై, మంటలు వ్యాపించి, సిలిండర్లు పేలి ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు


వారాహిమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు, పూజల్లో పాల్గొన్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో వారాహి అమ్మవారు

పెదపూడి: జి.మామిడాడలోని బిక్కవోలు రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రాణప్రతిష్ఠ చేసిన వారాహి మాతకు శుక్ల పంచమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మోహిత్‌శుక్లా అసుతోష్ త్రిపాఠి వేదమంత్రాల నడుమ గణపతి ఆరాధన హోమం, పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. జి.మామిడాడ, పరిసర గ్రామాల భక్తులు, అయ్యప్పస్వామి, భవానీ భక్తులు అమ్మవారిని అభిషేకించి, కుంకుమ పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ గురుస్వామి డీఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ, నిత్యం వారాహి అమ్మవారి దర్శనం ఉదయం నాలుగు నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉంటుందన్నారు.

దేవతామూర్తులకు ధాన్యాధివాసం


బలభద్రపురంలో ధాన్యాధివాసంలో ద్వాదశ జ్యోతిర్లింగ, శక్తిపీఠ దేవతా విగ్రహాలు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ప్రతిష్ఠ చేస్తున్న ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠ దేవతా విగ్రహాలకు ధాన్యాధివాసం నిర్వహించారు. శనివారం మూడో రోజు భాగంగా ఆలయం వద్ద 41 మంది దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


మండల విలేజ్, వార్డ్ ఎంప్లాయీస్ నూతన సంఘ ప్రతినిధులు

బిక్కవోలు: ఏపీ సచివాలయ విలేజ్, వార్డ్ సెక్రటేరియట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బిక్కవోలు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు సంఘ జిల్లా చైర్మన్ వరసాల రామదాసు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బిక్కవోలు తాలూకా కార్యదర్శి శివారెడ్డి పరిశీలకులుగా వ్యవహరించారు. స్థానిక సచివాలయం ఆవరణలో జరిగిన ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా వీవీఎస్ ఈశ్వర్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నూతిక అనూష, కార్యదర్శిగా తేలు గణేష్‌కుమార్, మరో 19 మంది సభ్యులతో మండల కమిటీ ఎన్నికైంది. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించినట్టు ఎన్నికల అధికారి రామదాసు తెలిపారు.

ఘనంగా నాగబంధం హోమం


ఆలయంలో ఏర్పాటు చేసిన హోమగుండం

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడి గ్రామ శివారునున్న శ్రీవల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం నాగబంధం హోమం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన స్వామివారి ఆలయప్రతిష్ఠ నిర్వహించనున్నారు. దీనికి ముందుగా ఐదు రోజుల పాటు హోమాలు నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా క్రొవ్విడి సూర్యనారాయణ మూర్తి, కంటే వినయ్‌తేజ, బూరుగుపూడి మాజీ సర్పంచ్ బుద్దిగ వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల రెండున నారసింహుని తెప్పోత్సవం

కోరుకొండ: శ్రీలక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం, గిరి ప్రదక్షిణ వచ్చే నెల రెండో తేదీన జరుగుతాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శనివారం ఆలయంలో తెప్పోత్సవ సమన్వయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. రోడ్డు విస్తరణ, దేవుని కోనేరు శుభ్రత, భక్తులకు సౌకర్యాలను ప్రస్తావించారు. దేవస్థానంలో భక్తులకు, అర్చక స్వాములకు తలెత్తుతున్న సమస్యలు, కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్‌పై ఎమ్మెల్యేను పలువురు ప్రశ్నించారు. దేవస్థానానికి భక్తుల సంఖ్య తగ్గుతున్న కారణంగానే అర్చకుల్లో గ్రూపులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సమావేశంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థాన ఈఈ సుబ్బారావు, సూపరింటెండెంట్ గుర్రాజు, తహసీల్దార్ సుస్వాగతం, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికలకు మెరుగైన భవిష్యత్తు నిర్మించాలి


విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: సమాజంలో బాలికల కోసం మెరుగైన భవిష్యత్తు నిర్మించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో బాలికను రక్షించండి–భవిష్యత్తును కాపాడండి అనే నినాదంతో సేవ్ గర్ల్ చైల్డ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, హింస, అసమానతలపై అవగాహన కల్పించారు. విద్య, పోషణ, భద్రత, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు, సాధికారత వంటి అంశాల్లో బాలికలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వి.తులసీదాస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇటు హరితం.. అటు స్వర్ణభరితం


ఇటు ఆకు పచ్చదనం.. అటు పసుపు పచ్చని పసిడి కాంతులీనిన వరి పొలాలు

రాజానగరం: వ్యవసాయం అంటేనే ఎంతో అందమైన, అద్భుతమైన ప్రకృతి ఆవిష్కరించే రూపం. కర్షకులు, శ్రామికులు నిత్యం చమటోడ్చి సాగులో వివిధ రకాల పండిస్తూ జనావళికి ఆహారాన్ని అందిస్తున్నారు. ఆ విధంగా సాగు చేసిన పంటలు ముఖ్యంగా వరి పంట కోతకు వచ్చే ముందు ఆకు పచ్చదనంతో కనువిందు చేస్తుంది. అదే పంట పక్వానికి వస్తే పసుపు పచ్చదనంతో పసిడికాంతులు చిందిస్తూ ఉంటుంది. ఈ రెండు దృశ్యాలు ఒకేచోట దర్శనమివ్వడం అరుదుగానే చెప్పవచ్చు. ప్రస్తుతం అటువంటి దృశ్యాలు రాజానగరం, నరేంద్రపురం, తూర్పుగానుగూడెంల్లో చూపరులకు కనువిందు చేస్తున్నాయి.